# కొత్తకొత్తగా..

- కొత్త ఓటరు కార్డుల పంపిణీ
- తపాలా శాఖ ద్వారా ఇంటికి కార్డులు
- పోలింగ్‌కు ఇక 9 రోజులే గడువు
- ఓటు ప్రాధాన్యతను తెలిపేలా ప్రచారం
- నేడు, రేపు 80 ఏండ్ల వృద్ధులకు ఇంటి నుంచే ఓటు



వనపర్తి, నవంబర్ 20 (నమస్తే తెలంగాణ) అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ తేదీ సమీపిస్తున్న దృష్ట్యా అధికార యంత్రాంగం ఓటర్లకు ఇబ్బందులు తలెత్తకుండా అన్ని చర్యలు తీసుకుంటుంది. కొత్తగా ఓటు హక్కు నమోదు చేసుకున్న యువతీ, యువకులతోపాటు చిరునామా, ఫొటోలాంటి మార్పులు చేసుకున్న వారికి సైతం ఎన్నికల సంఘం ముద్రించిన కొత్త గుర్తింపు కార్డులను జారీ చేస్తుంది. వీటిని ఓటర్లకు వెంటనే చేరేలా తపాలా శాఖ సేవలను ఎన్నికల సంఘం వినియోగించుకుంటుంది. స్పీడ్‌పోస్టు ద్వారా కార్డులను ఓటర్లకు అందేలా చర్యలు చేపట్టింది. రెండు, మూడు రోజులుగా జిల్లాలో తపాలా శాఖ సిబ్బంది వేగంగా కార్డుల పంపిణీ చేస్తున్నారు. కాగా, నియోజకవర్గంలో 5,529 మంది కొత్త ఓటర్లుగా నమోదయ్యారు.

### నేడు, రేపు వృద్ధులకు ఇంటినుంచే ఓటు

80ఏండ్లు దాటిన వృద్ధులు, వికలాంగులకు ఇంటి వద్దే ఓటు వేసేందుకు ఈ దఫా ఎన్నికల సంఘం సౌకర్యం కల్పిస్తున్నది. నియోజకవర్గంలో మొత్తం 180 మంది వృద్ధ ఓటర్లు ఇంటి వద్ద ఓటు వేసుకునేందుకు దరఖాస్తు చేసుకున్నారు. వీరందరికీ ఇంటి వద్దనే ఓటు వేసుకునే విధంగా చర్యలు తీసుకున్నారు. అలాగే వికలాంగులు 257మంది ఇంటి వద్ద ఓటు కోసం దరఖాస్తు చేసుకున్నారు. మొత్తం నియోజకవర్గంలో 437మంది ఇంటి దగ్గర ఓటు వేయడం కోసం దరఖాస్తులు చేశారు. జిల్లా యంత్రాంగం వీరందరికీ మంగళ, బుధ వారాల్లో రెండు రోజులపాటు ఓటు వేయించే ఏర్పాట్లు చేసింది. అయితే, ఇందు కోసం 8 బృందాలను ప్రత్యేకంగా ఏర్పాటు చేశారు. ముందుగా



ఇంటి దగ్గర ఓటు కోసం దరఖాస్తు చేసుకున్న వారికి నోటీసు ద్వారా ఓటు వేసే సమయాలను తెలియపరిచారు. ఈ క్రమంలో వృద్ధులు, వికలాంగులు తమ ఓటుహక్కును ఇంటి నుంచి వినియోగించుకోబోతున్నారు.

అయితే, ఇలా దరఖాస్తు చేసుకుని ఓటుహక్కును వినియోగించుకోని క్రమంలో వీరికి జనరల్ పోలింగ్ కేంద్రంలో ఓటు వేసే వెసలుబాటు ఉండదు. గతంలో ఇలాంటి వసతిని ఎన్నికల సంఘం చేపట్టలేదు. వయస్సు పైబడిన వారికి.. అలాగే వికలాంగులకు పోలింగ్ కేంద్రాలకు వెళ్లడంలో ఇబ్బందులుంటాయని భావించిన ఎన్నికల సంఘం కొత్తగా ఈ ప్రక్రియకు శ్రీకారం చుట్టింది. దీనివల్ల వృద్ధులకు కేంద్రాలకు వెళ్లే పని తప్పింది.

### ప్రాధాన్యతలపై ప్రచారం

ఓటుహక్కు వినియోగించుకోవడంపై ప్రాధాన్యతను తెలియజేసేందుకు ఎన్నికల సంఘం కార్యాచరణ చేపట్టింది. ఇందుకు కొత్తగా ఓటు నమోదు చేసుకున్న వారికి కార్డుల పంపిణీ సందర్భంగా ఓటు వినియోగం, దాని ఆవశ్యకతను తెలియజేస్తూ ప్రతిజ్ఞాపత్రం అందజేస్తున్నారు. అలాగే ఆయా సందర్భాల్లో అవసరమైన ఫిర్యాదులకు సంప్రదించాల్సిన 1950 నెంబరును తెలియపరుస్తూ ఓటరు హెల్ప్‌లైన్ వంటి సేవల సమాచారంపై ప్రచారం చేస్తున్నారు. ఇంకాను ప్రలోభాలకు లొంగకుండా నిర్భయంగా ఓటు వేసేలా సందేశాత్మకంగా పది పేజీలతో కూడిన ఓటరు గైడ్‌ను కొత్త కార్డులతో కలిపి ఇంటికి చేరవేస్తున్నారు. ఇటు పోస్టల్ శాఖ నుంచి అటు బీఎల్‌వోల ద్వారా పోలింగ్ పేపర్లను అందజేస్తున్న క్రమంలోనూ వీటిని ప్రతి ఓటరుకు చేరవేస్తూ చైతన్యం చేస్తున్నారు.

### పాతవారు కొత్తకార్డు పొందవచ్చు

కొత్తగా ఓటుహక్కు నమోదు కోసం దరఖాస్తు చేసుకున్న వారికి ఇంటింటికీ ఓటరు కార్డులను ఎన్నికల సంఘం అందించే బాధ్యతను చేపట్టింది. ఇక ఇదివరకే ఓటు హక్కు కలిగిన వారు కూడా కొత్త కార్డును పొందేలా వెసలుబాటును కల్పించింది. ఇందుకు సంబంధిత ఓటరు దగ్గరలోని మీసేవా కేంద్రాలను సంప్రదించడం ద్వారా కొత్త కార్డును పొందవచ్చు. తాజాగా విడుదలైన ఓటరు జాబితాలోని ఎపిక్‌కార్డు నెంబరు చెబితే మీసేవ సిబ్బంది అప్పటికప్పుడు ప్రింట్ తీసి కొత్త కార్డును అందజేస్తారు. ఓటరు జాబితాలో ఎపిక్ సంఖ్యను తెలుసుకోవాలంటే సంబంధిత వెబ్‌సైట్‌ను సందర్శించాల్సి ఉంటుంది.

## శ్రీశైలంలో భక్తుల సందడి



పాతాళ గంగలో పుణ్యస్నానాలు ఆచరిస్తున్న భక్తులు

శ్రీశైలం, నవంబర్ 20: శ్రీశైల భ్రమరాంబ మల్లికార్జున స్వామిఅమ్మవార్ల మహా పుణ్య క్షేత్రం భక్తులతో కిటకిటలాడుతుంది. కార్తీకమాసం తొలి సోమవారం పరమ శివుడి దర్శనానికి ఉభయ తెలుగు రాష్ట్రాల నుంచేకాక ఉత్తర దక్షిణాది రాష్ట్రాల నుంచి వచ్చిన యాత్రికులు తెల్లవారుజాము నుంచి క్యూలైన్లలో బారులుదీరారు. తెల్లవారుజుమున కృష్ణానదిలో పుణ్యస్నానాలు చేసుకుని పసుపు కుంకుమలతో సారె సమర్పించి, కార్తీక దీపదానాలు చేశారు. భక్తుల రద్దీ ఎక్కువగా ఉన్న కారణంగా శ్రీభ్రమరాంబ మల్లికార్జున స్వామిఅమ్మవార్ల దర్శనానికి నాలుగు గంటల సమయం పట్టిందని అధికారులు తెలిపారు. స్వామివారికి సామూహిక అభిషేకాలు, గర్భాలయాభిషేకాలను మాసాంతం తాత్కాలికంగా నిలిపి వేసినట్లు ఈవో పెద్దిరాజు తెలిపారు. అమ్మవారికి కుంకుమార్చనలు, చండీహోమం, రుద్రయాగం, నిత్యకల్యాణం భక్తులు పాల్గొన్నారు. ఆలయ ఉత్తర, శివ మాఢవీధితోపాటు గంగాధర మండపం వద్ద మహిళలు అధిక సంఖ్యలో కార్తీక దీపాలను వెలిగించుకున్నారు. ఆలయ దర్శనాలు ప్రారంభమై ముగిసేంత వరకు ఉచిత ప్రసాద వితరణ, క్యూలైన్లలో దర్శనానికి వేచిఉండే భక్తులకు పాలు, మంచినీరు, బిస్కెట్లు, అల్పాహార పొట్లాలు అందిస్తున్నట్లు అధికారులు తెలిపారు.

## ఆటో బోల్తా: మహిళ మృతి

కొల్లాపూర్, నవంబర్ 20: కొల్లాపూర్–వీపనగండ్ల మండలాల సరిహద్దులో సోమవారం ఆటో బోల్తాపడిన ఘటనలో భార్య మృతిచెందింది .ఘటనకు సంబంధించి వివరాలు ఇలా.. కొల్లాపూర్ మండలం సింగవట్నం గ్రామానికి చెందిన ఈదన్న, గంగమ్మ దంపతులు పదేండ్లుగా కూరగాయలను సొంతం ఆటోలో గ్రామాలకు తీసుకెళ్లి వ్యాపారం చేస్తూ జీవనం కొనసాగిస్తున్నారు. సోమవారం ఉదయం వీపనగండ్ల మండలం తూంకుంటలో కూరగాయలను విక్రయించుకొని తిరిగి ఆటోలో స్వగ్రామానికి ఆ దంపతులు వస్తున్నారు. భర్త ఈదన్న తన సొంత ఆటోను వేగంగా నడుపుతూ కొల్లాపూర్ మండల సరిహద్దులోని వీరనాయినేని చెరువు –తూంకుంట మార్గమధ్యంలో బోల్తాపడింది. ఈ ప్రమాదంలో భార్య గంగమ్మకు బలమైన రక్తగాయాలుకావడంతో కొల్లాపూర్ ప్రభుత్వ దవాఖానకు తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందింది. శవాన్ని పోస్టుమార్టం నిమిత్తం మార్చురీకి తరలించి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు కొల్లాపూర్ పోలీసులు తెలిపారు. మృతురాలికి ఇద్దరు కుమారులు,కుతూరు ఉన్నారు.

# ఎన్నికలను పకడ్బందీగా నిర్వహించాలి

- రాష్ట్రస్థాయి ప్రత్యేక పరిశీలకుడు అజయ్ వినాయక్
- పోలీసులు జాగ్రత్తగా వ్యవహరించాలి
- రాష్ట్రస్థాయి ప్రత్యేక పోలీసు పరిశీలకులు దీపక్ మిశ్రా



మాట్లాడుతున్న రాష్ట్రస్థాయి ప్రత్యేక పరిశీలకులు అజయ్ వినాయక్, దీపక్ మిశ్రా

నాగర్‌కర్నూల్, నవంబర్ 20: శాసనసభ ఎన్నికల్లో భాగంగా పంపిణీ చేసే ఓటరు స్లిప్‌లను జాగ్రత్తగా పంపిణీ చేయాలని, ఎన్నికల నిర్వహణలో ప్రజలతోపాటు రాజకీయ పార్టీల అభ్యర్థులకు ప్రతి సమాచారాన్ని అందజేస్తూ ఎన్నికలను అత్యంత పారదర్శకంగా నిర్వహించాలని కేంద్ర ఎన్నికల సంఘం ద్వారా నియమించిన రాష్ట్రస్థాయి ప్రత్యేక సాధారణ పరిశీలకుడు, రిటైర్డ్ ఐఏఎస్ అధికారి అజయ్ వినాయక్ తెలిపారు. ఇప్పటివరకు పంపిణీ చేసిన ఓటరు సమాచార స్లిప్‌లతోపాటు, ఇంకా పంపిణీ చేయాల్సిన వాటిని సక్రమంగా పంపిణీ చేసేలా చూడాలన్నారు. సోమవారం సాయంత్రం అయన జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా అధికారుల కార్యాలయ భవన సముదాయ వీడియో కాన్ఫరెన్స్ సమావేశ మందిరంలో జిల్లాలో పోలింగ్ సంసిద్ధతపై జిల్లా పరిశీలకుడు, కలెక్టర్, ఎస్పీ, రిటర్నింగ్ అధికారులు, నోడల్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ విడుత కేంద్ర ఎన్నికల సంఘం 80 ఏండ్లు పైబడిన, అలాగే కదలలేని వారి కోసం ప్రత్యేకంగా కల్పించిన ఇంటి ఓటు సదుపాయం 12–డి విషయమై ఎంత మందికి ఓటుహక్కు కల్పించామన్న రూట్ మ్యాప్‌తో పాటు, షెడ్యూల్‌ను రాజకీయ పార్టీల ప్రతినిధులకు అందజేసి వారి సంతకం తీసుకోవాలని, అదేవిధంగా పోస్టల్ బ్యాలెట్‌కి సంబంధించి సంతకం తీసుకోవాలన్నారు.

ఎన్నికల సందర్భంగా 1950 టోల్ ఫ్రీ నెంబర్ కు, అదేవిధంగా ఫిర్యాదుల సెల్‌కు వచ్చే అన్ని ఫిర్యాదులను ప్రత్యేకంగా రిజిస్టర్ ఏర్పాటు చేసి నిర్వహించాలని రాష్ట్రస్థాయి ప్రత్యేక పరిశీలకుడు సూచించారు. రాష్ట్రస్థాయి ప్రత్యేక పోలీస్ పరిశీలకులు, ఐపీఎస్ అధికారి దీపక్ మిశ్రా మాట్లాడుతూ ఎన్నికల సందర్భంగా అదనపు బలగాలను రిజర్వులో ఉంచుకోవాలని, ఎక్కడైనా సమస్య ఉత్పన్నమైనప్పుడు అత్యవసర సమయంలో వినియోగించుకోనేలా పోలీస్ సిబ్బంది ఉండాలని సూచించారు. అన్ని పోలింగ్ బూత్‌లు మ్యాపింగ్ చేయాలని, పోలింగ్ రోజున ఎక్కువ మంది ఒకే చోట గుమి కూడకుండా 144 సెక్షన్ విధించాలని, పోలింగ్ కేంద్రంలోకి ఎవరెవరిని అనుమతిస్తారో ప్రతి పోలింగ్ అధికారి ముందే తెలుసుకొని ఉండేలా అవగాహన కల్పించాలని, పోలింగ్ కేంద్రాలకు వచ్చే ప్రతి ఒక్కరిని తనిఖీ చేసి పంపించాలని, ఎవరైనా ఎన్నికలకు సంబంధించి తప్పుడు సమాచారం అందించినప్పుడు తక్షణమే దానిని సోషల్ మీడియా ద్వారా సరైన సమాచారం ఇచ్చే విధంగా సోషల్ మీడియా టీమ్‌ను అప్రమత్తం చేయాలని తెలిపారు. అదేవిధంగా పోలింగ్ రోజు ఎన్నికలకు ఘుయిత్యం కలిగించే వ్యక్తులను ఎట్టి పరిస్థితుల్లో ఉపేక్షించకుండా కఠిన చర్యలు తీసుకోవాలని, అలాంటి వారిని ముందస్తుగానే గుర్తించి బైండోవర్ చేయాలని ఆదేశించారు. అంతకుముందు జిల్లా కలెక్టర్ ఉదయ్‌కుమార్ జిల్లాలో శాసనసభ ఎన్నికల నిర్వహణకు నాగర్‌కర్నూల్, కొల్లాపూర్, అచ్చంపేట నియోజకవర్గాలలో చేసిన వివరాలను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. జిల్లాలోని పైమూడు నియోజకవర్గాలలో 43 మంది అభ్యర్థులు పోటీలో ఉన్నారని, 802 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయడం జరిగిందని, 7 లక్షల 9 వేల 76 మంది ఓటర్లు నవంబర్ 30వ తేదీ నిర్వహించే పోలింగ్‌లో వారి ఓటు హక్కును వినియోగించుకొనున్నారని తెలిపారు. కొత్తగా ఓటరు గుర్తింపు కార్డులు పొందిన వారి ఓటర్ గుర్తింపు కార్డుల పంపిణీ, పోలింగ్ కేంద్రాలలో సౌకర్యాలు, ఈవీఎంల రాండమైజేషన్ ఫామ్ 12–డి పంపిణీ, అదేవిధంగా హోమ్ ఓటింగ్ తదితర అంశాలపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు.

ఎస్పీ గైక్వాడ్ వైభవ్ రఘునాథ్ మాట్లాడుతూ.. పోలీసు పరంగా నాగర్‌కర్నూల్ జిల్లాతోపాటు వనపర్తి, కల్వకుర్తి జిల్లాల పరిధిలోని కొన్ని పోలింగ్ కేంద్రాలు కలుపుకొని కేంద్రాలకు సంబంధించి బందోబస్తును పర్యవేక్షిస్తున్నట్టు తెలిపారు. ఎన్నికలలో భాగంగా అంతర్ జిల్లా చెక్‌పోస్టుల ఏర్పాటు, ఎన్నికల నియమావళిని ఉల్లంఘించి అక్రమంగా తరలించే మద్యం, నగదు సీజ్ చేయడం, కేసులు, బైండోవర్ చేస్తున్నట్లు వెల్లడించారు. గత నెల 28న రెండు కంపెనీల సిఏపీపిఎఫ్ బృందాలు వచ్చాయని, ఈనెల పోలింగ్‌కు ముందు అదనపు బలగాలు రానున్నాయని తెలిపారు. జిల్లా కునియమితులైన నాగర్‌కర్నూల్, అచ్చంపేట, కొల్లాపూర్ ఎన్నికల సాధారణ పరిశీలకులు మిథిలేష్ మిశ్రా, సతీశ్‌కుమార్ పోలీస్ ఇలియాస్ కేపీఏ, ఎక్స్‌పెండేచర్ అబ్జర్వర్ భేరారామ్ చౌదరి, అదనపు కలెక్టర్లు కుమార్‌దీపక్, కే సీతారామారావు, అదనపు ఎస్పీ రామేశ్వర్, రిటర్నింగ్ అధికారులు వెంకట్‌రెడ్డి, గోపిరామ్, కలెక్టరేట్ ఏవో శ్రీనివాసులు, ఎన్నికల జిల్లా నోడల్ అధికారులు ఈ సమావేశానికి హాజరయ్యారు.



వీడియో కాన్ఫరెన్స్‌కు హాజరైన అధికారులు